# తనవాళ్ళు

రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు) తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

## కోరుకొండ సత్యానంద్

**రెం**డు రాష్ట్రాల అవతలకి ట్రాన్స్‌ఫర య్యింది. అదీ ఓ ఖరీదైన నగరానికి. ఇంట్లో చెప్పేను. ఇల్లంతా నిశ్శబ్దంతో నిండిపోయింది. నా కళ్ళ ముందు ఎన్నో సమస్యలు కదులుతున్నాయి. గంట వరకూ ఎవరమూ ఏమీ మాట్లాడుకోలే దదు.

ఆతర్వాత శ్రీమతి పిల్లల్ని మేడ మీదకు తీసుకె ళ్ళింది. అమ్మ నా దగ్గరకు వచ్చింది. నాన్న కాస్త దూరంలో కూర్చున్నారు.

"ట్రాన్స్‌ఫర్ని ఆపుకోవడం కుదరదా."

"ప్రమోషన్ వదులుకోవాలమ్మా. అలా చేస్తే ఎప్పుడు పైకెళ్ళగలం. ఈ కాడర్లోనే ట్రాన్స్‌ఫర్ చేసే అధికారం మేనేజ్‌మెంటుకి ఉంది."

"పోన్లేరా. ఇన్నాళ్ళూ ఉన్నది సొంత ఊళ్ళోనే కదా. ఏడాదికో ఊరు తిరిగే వాళ్ళు ఎంతమంది లేరు?"

"పొరుగూరైతే ఫర్వాలేదు. పొరుగు రాష్ట్రమైనా కాదు."

"దూరం తక్కువైతే సమస్యలు ఉండవా."

అమ్మ రీజనింగ్ అర్థమై అన్నాను... "మన జీవితం ఎంతగానో ఈ ఊరితో పెనవేసుకుపోయింది. ఈ రాష్ట్రమైతే ఒకటీ అరా సమస్యలు తగ్గుతాయి గానీ, వేరే రాష్ట్రం అయినప్పుడు అది ఏ రాష్ట్రమైనా ఒకటే. కాకపోతే వెళ్ళి వచ్చే దూరం, ఖర్చుల్లో కొద్దిగా తేడా ఉంటుంది. అంతే."

"అవును కదా. ఎక్కడికి వెళ్ళినా ఉండే సుఖాలు, కష్టనష్టాలు ఉంటూనే ఉంటాయి. వాటి గురించి ఆలోచించ వచ్చు. కానీ బెంబేలు పడిపోకూడదు. మార్పుని తట్టుకొనే శక్తి వృక్షాలకి, జంతువులకే ఉన్న మనుష్యులకి ఉండ కపోతే ఎలా...

"కానీ అమ్మా..."

"ఇంకేమీ ఆలోచించకు. వెళ్ళే ప్రయత్నాలు మొదలుపెట్టు. వెళ్ళాక స్థిమితంగా కొన్నాళ్ళుండి మా దగ్గరకు వచ్చేయడానికి ప్రయత్నించు..."

అమ్మ అన్న మాటలు ముందు అర్థం కాలేదు. అర్థమయ్యాక ఆశ్చర్య పోయాను.

"అమ్మా. అదేంటీ. అక్కడికి మనం దరమూ కదా వెళ్ళేది. మేమే వెళ్తాం అని ఈ అయోమయంలో పడి నేను గానీ అన్నానా?"

"లేదురా. నువ్వలా అనలేదు. కానీ మనమందరమూ వెళ్తే సమస్యలు ఎక్కువవుతాయి. మేం లేకపోతే నీకు కొన్ని విషయాల్లో సులువవుతుంది."


"అదేంటమ్మా . మీరొస్తే సమస్య లేంటి."

"చాలా ఉన్నాయి. మేమొస్తే పెద్ద ఇల్లు ఉండాలి. మేం సర్దుకోం అనికాదు. ఎంత సర్దుకున్నా మనకి సరిపడే ఇంటికి ఇవ్వాల్సిన అద్దెకు, మీరు సర్దుకుంటే ఇవ్వాల్సిన అద్దెకు తేడా చాలా ఉంటుంది. మీకు మీరు, మాకు మేము సర్దుకోగలం గానీ మన మందరమూ కలిసి సర్దుకోలేం. అలా చేస్తే మీ ఆనందాన్ని ఎంతో కొంతైనా అణిచేసుకోవాల్సి వస్తుంది."


నేనేదో అనబోతుంటే అమ్మా వారిం చింద.

... అదీకాక ఇది మన సొంత ఇల్లు. దీని మీద అద్దె రాదని కాదు. దీనిలో ఉండే అనుభూతిని మేం పొందే కాలం తగ్గిపోతుంది."

"అయితే మీకు నా మీద కన్నా ఇంటిమీదే ఎక్కువ ప్రేమన్నమాట."



“ఇది నాన్నగారు రిటైరైతే వచ్చిన డబ్బుతో కొన్నాళ్ళ క్రిందటే కట్టుకున్న ఇల్లు. నువ్వు మాకు దూరంగా వెళ్ళి అభివృద్ధిలోకి వస్తావు. ఈ ఇంటికి మనందరమూ దూరమైతే ఇది కొంతైనా పాడైపోతుంది. ఇల్లు, పిల్లలు రెండింటి క్షేమం ఆశించడమే మా ఆలోచన. ఆర్నెల్లకోసారి రండి. నాలుగు రోజులుండి వెళ్ళండి. మా దగ్గరకు రావడానికి మీరు పడే ఆత్రం, మీ కోసం మేం ఎదురుచూడ్డం... ఆ అనుభూతి మనకు ఇంతవరకూ కలగలేదు. దాన్నీ ఆస్వాదిద్దాం. అప్పుడప్పుడూ



మేమూ వస్తాం. మిమ్మల్ని, కొత్త ప్రదేశాల్నీ చూస్తాం. కలసి ఉండే కాదు, దూరంగా ఉన్నా పొందడానికి ఎన్నో అనుభూతులుంటాయి. అనుభూతులే బ్రతుక్కి క్రొత్త ఊపరినిస్తాయి."

ఎప్పుడూ అమ్మ మాటలు తన వాదాన్ని బలపరచేవిగా ఉంటాయి. నాన్న కూడా అదే అన్నారు. అయినా నా మనస్సంగీకరించలేదు.

అమ్మా నాన్నల్ని విడిచి నేనెప్పుడూ ఉండలేదు. చదువంతా వాళ్ళ దగ్గరే గానీ ఎప్పుడూ హాస్టల్లో ఉండలేదు. మరే ఉద్యోగమూ వాళ్ళకు దూరంగా ఉండి చేయలేదు. అందుకే ఆలోచనలను వెతుక్కొని, పరిస్థితుల్ని పడిగట్టి వాళ్ళతో చర్చించేను. అన్నింటికీ అమ్మా నాన్నలు పరిష్కారాల్ని చెప్పేసేరు.


...ఇంత ఇంట్లో మేమే ఎందుకుంటాం. పై రెండు గదుల్లో మేముంటాం. క్రింద అద్దెకిస్తాం. వచ్చే అద్దెను సరిపెట్టుకుంటాం. నాన్న ఏదో ఒకటి చేసి పదీ పరకా సంపాదించలేరా. అంతగా అవసరమై ఉత్తరం రాస్తే నువ్వు పంపని కొడుకువా. ఆ ఊరెళ్ళాక మారిపోతావా...

...ఇంట్లోకొచ్చిన వాళ్ళు మాకు తోడుండరా. మా కష్ట సుఖాలకు ఇరుగూ పొరుగూ లేరా. అంతగా అయితే నీకు అడ్రస్ ఉండదా. దేశంలో పోస్టల్ సౌకర్యం లేదా. ఫోన్లు లేవా. పరుగెత్తుకు రావడానికి సూపర్‌ఫాస్ట్ రైళ్ళు లేవా...

...మా శరీరాలు ఇంకా ఒడిలిపోలేదుగా. బి.పి, షుగర్లూ లేవు కదా. కళ్ళు, కాళ్ళ పనిచేస్తూనే ఉన్నాయిగా. మా గుండె, ఊపిరితిత్తులు, కాలేయాలకి కిడ్నీలకు ఇంతవరకూ ఏ జబ్బూ రాలేదుగా...

ఆలా అన్నింటికీ అతికినట్టు సమాధానాలు చెప్పి నన్ను ఒప్పించేసేరు. అయినా నా మనసు పీకుతూనే ఉంది.

ఎదురున్నా, ఎంత ఉపయోగపడినా తన వాళ్ళు ఒక్కరైనా లేకపోతే మనసు మూల్గకుండా ఉంటుందా! ఆ వెలితిని ఎందరున్నా తీర్చగలరా. తమ రక్తమే ప్రవహిస్తున్న వాళ్ళు సాన్నిహిత్యం ఇచ్చే ఆనందం మరొకరు ఇవ్వగలరా. రక్తమన్నది భౌతికమైనదైనా అది పెనవేసే మానసిక పాశాన్ని ఇతరులెవ్వరూ చొరబడి కూడా ముడివేయలేరు కదా.




నాకు నా బాల్యం గుర్తొచ్చింది.

...అమ్మ కడుపు మీద ముఖం పెట్టుకొని పడుకుంటే అమ్మ అరచేయి నా తల మీద ఉండేది. నాన్న నడుము మీద కాలువేసి పడుకుంటే నాన్న రెండు చేతులు నన్ను చుట్టేసేవి. ఉక్కలో చల్లగా, చలిలో వెచ్చగా ఉండే ఆ ప్రేమ మందిరిఆల్లోంచి పెరిగి పెద్దవాడినై బయటకు వచ్చేసినా ఆ అనుభూతుల ఆనవాళ్ళు గుండెలో అలాగే ఉండిపోయేయి. మళ్ళీ అవి నాకు దక్కాలంటే మరో జన్మ ఎత్తాల్సిందే...

...కడుపులో తలపెట్టుకొన్నప్పటి నా లేత స్పర్శ, సాధికారంగా వేసిన అప్పటి నా కళ్ళ బరువుని మురిపెంగా ఓర్చుకొనే ఆ అనుభవం... మళ్ళీ అమ్మా నాన్నలకు కావాలన్నా వాళ్ళు మరో జన్మ ఎత్తాల్సిందేనా...?

అక్కర్లేదేమో... అమ్మా నాన్నల రక్తం నా ద్వారా సంక్రమించి ప్రాణం పోసుకున్న...

సరిగ్గా అప్పుడే నాకో ఆలోచన వచ్చింది. కానీ వెంటనే వాళ్ళతో నా ఆలోచనని చెప్పలేకపోయాను. తండ్రి చేతనిస్తే తల్లి రక్షణ్నీ, రూపాన్నీ, పోషణనీ ఇస్తుంది కాబట్టి ముందుగా ఆ రాత్రి నా ఆలోచనని శ్రీమతి ముందుంచేను.

విని తెల్లబోయి చూసింది నావైపు. చాలా సేపటి తర్వాత చాలా మాట్లాడింది. తనవరకూ ఆ మాటలు సమంజసమేనని అనిపించినా నాకు మాత్రం అవి రుచించలేదు. తను మూడంకె వేసి పడుకుందేమో గానీ, నేను మాత్రం ఆ నాలుగు జాములూ నిద్రలోకి జారలేకపోయాను.

...అమ్మ కడుపు మీద నా ముఖం, నాన్న నడుము మీద నా కాళ్ళు. నా తల మీద అమ్మ చేయి. నన్ను చుట్టేస్తూ నాన్న చేతులు...

అదే దృశ్యం. అయితే నా స్థానంలో మార్చి మార్చి నా పిల్లల్లో ఎవరో ఒకరు... ఆ దృశ్యాన్ని చెరిపేస్తూ శ్రీమతి మాటలు!

...పిల్లలు మీకెక్కువైపోయారా. కన్నవాళ్ళల్లో ఏ ఒక్కరు లేకపోయినా నేనుండలేనండీ. అత్తయ్య గార్ని, మావయ్యగార్ని మనతో రమ్మనండి. లేదా ఆ ఊరు మీరొక్కరే వెళ్ళండి. లేకపోతే ప్రమోషనైనా వదులుకోండి. కానీ అలా చేయమని మాత్రం అనకండి...

నాకు ఆపేక్ష లేక కాదు. అమ్మానాన్నల రక్తం హోరు కాకుండా, అనుభూతిని ఆస్వాదిస్తూ మెలమెల్లగా సాగే అవకాశాన్ని అందిద్దామనే నా ఆలోచన. శ్రీమతికి అర్థం కావట్లేదది.

అయినా అంతటితో ఆగలేకపోయాను. మర్నాడు రాత్రి పిల్లలు ముగ్గురూ అమ్మ చుట్టూ చేరి కబుర్లు చెప్తున్నప్పుడు వాళ్ళ దగ్గరకు వెళ్ళేను.

మాకు ముందు ప్రశాంతి పుట్టింది. నాకైతే చాలనిపించింది. శ్రీమతి మరొక్కసారి చూద్దామంది. లేని మగబిడ్డన్నా, ఆడపిల్లయినా తల్లిదండ్రులకుండే సహజమైన భ్రాంతి నాకూ లేకపోలేదు. తర్వాత సాగర్ పుట్టేడు. ఆపరేషన్‌కి సన్నద్ధమవుతుంటే అమ్మ అంది.

"మరొకసారికి ఆగితే ప్రశాంతికి ఆడపిల్లో, వీడికి మగాడో తోడవుతాడు. ఒకసారి ఆలోచించరా."

"ఇంకోసారి కూడా ఆలోచిస్తానమ్మా ఆ మిగిలిపోయిన వాళ్ళక్కూడ తోడు "ఎవరేమో" అన్నాను నవ్వుతూ.

పుట్టారేమో అమ్మ మాటకు ఆగకుండా ఉండలేకపోయాను. శ్రీమతి కాస్త కినుక వహించినా చివరికి ఒప్పుకుంది. చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అని తెలియక కాదు, అమ్మ అన్న మాట నా మీద అలా పనిచేసింది.

"నువ్వు మాకొక్కడివి. మరొకళ్ళని పొందలేకపోయాం. నా చుట్టూ బోలెడు పిల్లలు, అదీ నీ పిల్లలు, గుమికూడితే చిట్టిచిట్టి కథలు చెప్పాలని నా ఆశ. బోలెడుమంది అక్కరలేదు గానీ ముగ్గురితో మురిపాలు పంచుకోవాలని ఉందిరా."

ఆరోజు స్కూలు విషయాలేవో నానమ్మకు చెప్తున్నారు వాళ్ళు. వాళ్ళ మాటలు వింటూ అమ్మ మురిసిపోతుంది. అప్పుడు అమ్మ కళ్ళల్లో వెన్నెలను మరిపించే వెలుగుంది. ఆ వెన్నెలకు కారుమేఘం క్రమ్మినట్టు నా ట్రాన్స్‌ఫర్. ముసురుపట్టినట్టు శ్రీమతి మంకుపట్టు. ఆ మేఘాల్ని, ముసుర్ని తరిమికొట్టే ప్రయత్నంలో ఉన్నాను. అందులో భాగంగానే నేను వాళ్ళతో మాటలు మొదలు పెట్టేను.

"ప్రశాంతీ. నాకు ట్రాన్స్‌ఫరయింది కదా. అక్కడ భాష మనది కాదు. ఇక్కడ ఉన్న మీ స్నేహితులు అక్కడ ఉండరు. స్కూలు కొత్త. ఇల్లు కొత్త. మరి నువ్వు వస్తావా. నానమ్మ తాతయ్యల్తో ఉంటావా?"

దానికేం చెప్పాలో తెలియక నావైపు, అమ్మ వైపూ చూసింది.

"చెప్పమ్మా. డాడీ వాళ్ళతో వెళ్ళిపోతావా. ఇక్కడే నాతో ఉంటావా" అని అడిగింది అమ్మ.

"అమ్మ ఎక్కడుంటుంది" అని అడిగింది ప్రశాంతి నన్ను.

"ఆ ఊళ్ళోనే" నేను చెప్పేను.

"అయితే నేనూ ఆ ఊరే వచ్చేస్తాను" అంది.

"సరేలే. నువ్వు ఆడపిల్లవు కదదా. మాతోనే ఉందువు గాని. అమ్మకి సాయం అవుతావు. ప్రశాంతితో అలా అని సాగర్‌వైపుకి తిరిగి–మరి నువ్వు ఎక్కడ ఉంటావురా" అని అడిగేను.

"నేనూ మీతో వచ్చేస్తాను" అన్నాడు వాడు.

"నానమ్మ దగ్గర ఉండరా. నువ్వంటే నానమ్మకి ఇష్టం కదా."

"ఉహు... నానమ్మకి నేనంటే ఇష్టం ఉండదు. ఏం తెచ్చినా ముందు విజయ్‌కే పెడుతుంది. నేనేం చేసినా తిడుతుంది. అదే విజయ్ చేస్తే తిట్టదు. పైగా నవ్వుతూ ముద్దు పెట్టుకుంటుంది."

"విజయ్ చిన్నవాడు కాబట్టి ముద్దు చేస్తాను. అదే నువ్వు మా దగ్గర ఉన్నావనుకో. నువ్వొక్కడవే వుంటావు కాబట్టి నిన్నింకా ముద్దుగా చూసుకుంటాను. అడిగినవి చేసి పెడతాను. కొని పెడతాను."

"నాకేమీ వద్దు. నేను ఇక్కడ ఉండను. అమ్మ డాడీల్తోనే వెళ్ళిపోతాను!"

సాగర్ ఖచ్చితంగా అనేసేడు. అప్పుడు నెమ్మదిగా అమ్మవైపు చూసేను. అమ్మ చిన్నగా నవ్వుతుంది. అయితే ఆ నవ్వులో నీడలాంటిదేదో కన్పించింది.

తర్వాత విజయ్‌ని అడిగేను "నువ్వెవరి దగ్గర ఉంటావురా. మా దగ్గరా, నానమ్మ దగ్గరా."

విజయ్ కాసేపు నావైపు, కాసేపు అమ్మవైపు, మరికాసేపు పైకీ చూసి ఏదో నిర్ణయానికొచ్చిన వాడిలా పెదవి కదిపేడు.

"నేను నానమ్మ దగ్గరే ఉంటాను డాడీ. మీతో రాను" అన్నాడు.

నాకెందుకో విచిత్రంగా చాలా ఆనందమేసింది. వెంటనే అమ్మ వైపు చూసేను. అమ్మ ముఖం చంద్రబింబమే అయిపోయింది. ఇందాక కన్పించిన నీడ ఏమాత్రం లేదిప్పుడు.

"నా చిన్నా. నా కన్నా. మీ అమ్మనీ, డాడీని కోరుకొని నిన్ను పొందినందుకు మాట నిలబెట్టేవురా. నువ్వుండిపోతే నిన్ను అవురూపంగా చూసుకోనురా. వెన్నెల చిలికి వెన్నముద్దలు చేసి గోరు ముద్దలు తినిపించనురా. బాగా చదివించి నిన్ను మీ నాన్న కంటే గొప్పవాణ్ణి చేయనురా...

విజయ్‌ని గుండెల మీద పెట్టుకొని వాడి తల నిమురుతూ, మురిసిపోతూ అమ్మ అలా మాట్లాడుతుంటే నా మనసు ఏదో భావంతో వులకించిపోయింది.

ఆ రాత్రి ఒక్కసారిగా మెలకువ వచ్చేవరకూ ఆ వులకింతలోనే ఉండిపోయాను.

విజయ్ ఏడుస్తున్నాడు నేను లేచి చూసేసరికి. వాడి ఏడుపు విన్పించే నాకు మెలకువ వచ్చింది. అప్పడే లేచి లైటు వేసింది శ్రీమతి.

"ఏం చిన్నా. ఏమయ్యిందిరా. భయపడ్డవా" భుజం తడుతూ అడుగుతుంది.

"... ... ..." వాడి ఏడుపు తగ్గింది గానీ ఏమీ మాట్లాడడం లేదు.

"చిన్నా. ఏం నాన్నా. ఏదైనా కలొచ్చిందా" అడిగాన్నేను.

అంతవరకూ బరువెక్కి ఉన్న ఊపిరి తేలికైనట్టుంది. నిముషం తర్వాత అడిగాడు విజయ్.

"అమ్మా... మీరు... వెళ్ళి...పోతారా."

కొంచెం ముందుకి వంగి వాడి వైపు చూసేను. వాడు వాళ్ళమ్మ వైపు చూస్తూ అన్నాడు "నానమ్మ దగ్గర నన్నొదిలేసి వెళ్ళిపోతారా."

కనురెప్పలు వేయకుండా చెవులు రిక్కించి వింటున్నాను.

"నేనూ మీతో వచ్చేస్తాను... మీ దగ్గరే ఉంటాను."

నిర్ఘాంతపోయాన్నేను ఆ క్షణంలో. వాడి మెదడులో మొలకెత్తిన ఆలోచనకో, వాడి గొంతులో విన్పించిన భయానికో నేను విచిత్రంగా కదిలిపోయి వాడ్ని ఎత్తుకొని గుండెలకు హత్తుకున్నానను.

"డాడీ... నన్ను వదిలేయకండి. నన్నూ మీతో తీసుకెళ్ళండి."

"... ... ..."

"తీసుకెళ్తారా. వదిలేస్తారా."

శరీరంలో అణువుల్ని విడదీసి కుప్పలా పోసేస్తున్నాయి వాడి ప్రశ్నలు. అది ఏడుపు కాదు గానీ అంతకంటే బలమైనదేదో నా గొంతును పూడ్చేస్తుంటే అతి కష్టం మీద పెగుల్చుకుని అన్నాను.

"లేదురా చిన్నా. నిన్ను వదిలెయ్యంరా. మాతోనే తీసుకెళ్ళిపోతాం. సరేనా?" అలా రెండు మూడుసార్లు అంటే గానీ వాడి ముఖంలో వెలుగు రాలేదు. అప్పుడు గానీ శ్రీమతి కళ్ళు తుడుచుకుంది కాదు.

విజయ్‌ని గుండెల మీద నుండి మంచం మీద వేస్తున్నప్పుడు చూసాను. గుమ్మం దగ్గర అమ్మని. రంగులన్నీ కలిస్తే ధవళ వర్ణం అవుతుందంటారు. కానీ అప్పుడు అమ్మ ముఖంలో రంగులన్నీ కలిసిపోయి కారుమబ్బుగా రూపుదాల్చుకున్నాయి.

వేవేద్రో అనబోతుంటే "వాడ్ని గుండెల మీద వేసుకొని పడుకో. భయపడినట్టున్నాడు" అని వెళ్ళిపోయింది తన గదిలోకి.

ఉదయం అమ్మ ముఖం చూడలేకపోయాను. ఆఫీసుకెళ్ళాక కూడా నా కళ్ళలో అమ్మే కదలాడింది. మ్లానమైన ముఖంతో.

ముందుగా విజయ్ అన్న మాటలకి మురిసిపోయిన అమ్మ అంత రాత్రి వేళ అంతగా బెంబేలు పడిపోయిన వాడి ప్రవర్తనకి ఎంత నలిగిపోయి ఉంటుందో. ఇంటికెళ్ళిన వెంటనే అమ్మతో మాట్లాడాలి. అమ్మ మనసుకి సేదతీర్చాలి. ఏదోలా అమ్మ దగ్గర ఎవరో ఒకర్ని ఉంచి అమ్మ ముఖంలో వెలుగుని నింపాలి.

సాయంత్రం ఆఫీసు నుండి నేరుగా ఇంటికెళ్ళిపోయాను.

అమ్మ ఇంట్లో లేదు. నాన్న నడిగితే మీడ మీద ఉందని చెప్పేరు. పైకెళ్ళేను. మేడ మీద మొక్కలకి నీళ్ళుపోస్తుంది అమ్మ. అమ్మకి మొక్కలంటే ప్రేమ. అవి మారాకు వేసినా, మొగ్గలు తొడిగినా, అవి వికసించి వువ్వులైన అమ్మకెంత ఆనందమో. పసిపిల్లలాంటి మనసు అమ్మది. దానికి రాత్రి గాయం తగిలింది. ఒక విధంగా అందుకు కారణం నేనే. దాన్ని మాన్పాల్సిందీ నేనే.

నెమ్మదిగా అమ్మ దగ్గరకెళ్ళేను. తలెత్తి నా వైపు చూసి చూసి మళ్ళీ నీళ్ళు పోయడంలో నిమగ్నమైపోయింది. అయితే ఏదో విషయాన్ని తదేకంగా ఆలోచిస్తున్నట్టుగా భారంగా కన్పించింది నాకు.

"...అమ్మా..."

"ఏం నాన్నా. ఈవాళ తొందరగా వచ్చేసావా."

"అవునమ్మా..." అని క్షణం ఆగి... "ఎల్లుండి ఆ ఊరు వెళ్తున్నాను. మధ్యలో రెండ్రోజులు సెలవు కలిసొస్తుంది. ఇల్లు, పిల్లలకి స్కూలు చూసుకొని వస్తాను."

"మంచిది. వెళ్ళిరా. ఇల్లు స్కూలుకీ, నీ ఆఫీసుకీ కాస్త దగ్గర్లో చూడు."

"అమ్మా. ఇలా కూర్చో."

ఏమిటన్నట్లుగా నావైపు చూస్తూ అక్కడున్న సిమెంటు బెంచీ మీద కూర్చుంది అమ్మ. నేను ప్రక్కనే కూర్చొన్నాను.

"...విజయ్ మాటలు పట్టించుకోకు. చిన్నవాడు కదా."

అమ్మ చిన్నగా నవ్వి అంది... "ఇవాళంతా ఆ విషయమే ఆలోచించేవా?"

"అవునమ్మా. నాకే ఎంతో బాధేసింది. నువ్వెంత విలవిల్లాండి ఉంటావో."

"ఎందుకురా ప్రతీదాన్నీ అంత ఎక్కువగా ఆలోచిస్తావు. ఇప్పడేమయ్యింది. పసివాడు. అన్నమాటని అమ్మ ప్రక్కలో పడుకొని ఆలోచించుకుంటే వాడికి భయమేసింది. అంత చిన్నవాడే ఆలోచించిన విషయాన్ని మనం ఆలోచించలేదు. అంతే."

"అక్కడ స్కూల్లో రెండు సీట్లే మాట్లాడతాను. ప్రశాంతినో, సాగర్‌నో మీతో ఉంచుతాను."



# మర్రిచెట్టు

ఈ నేలంటే ఎంత ప్రేమో దీనికి
తల్లి పిల్ల వేర్లతో సహా కావలించుకుంటుంది
తన్ని నిటారుగా నిలబెట్టినందుకో..
నిత్యం పోషిస్తున్నందుకో..
గుండెల్నుండి వేలాడే
ఊడలు చేతులన్నింటినీ చాచి
నేలకు నమస్కరిస్తుంటుందది
దీని శరీరం లాగా దీని హృదయమూ
విశాలం-
ప్రేమికుల ప్రేమ చిహ్నాల్ని పచ్చబొట్లుగా
శరీరం మీద పొడిపించుకుంటుంది
కొమ్మల భుజాల మీద
గూళ్లన్నింటినీ మోస్తుంటుంది
ఎన్నో బతుకుల వెతల్ని
తన ముంగిట చూసి
ఇది కరడు కట్టినంటాది గానీ
తెల్లవారుఘామున పక్షుల కిలకిల ల్తోటి-
సాయంత్రాలు పిల్లల ఊడల ఉయ్యాలాటల్తోటూ-
దీనిలోనూ
ఓ పసి మనసు మేల్కొంటుంది



సెలవని సంధ్య వెళ్లిన తర్వాత,
చిరుచీకటి తెరల వెనుకే
ఇది
ఎంతకీ అంతు చిక్కని మగువ మనసులా
భయద సౌందర్యంలా
గుబులు రేపుతుంటుంది
వెన్నెల రాత్రులు
వేన వేల ఆకుల హృదయాల్తో మెరుస్తూ
జారుతున్న జాబిలి జలపాతంలా
ఉంటుందది
చూసే హృదయానికి ఎన్ని కళ్లుండాలి
రా..
చూడు
నా కళ్లతో
ఇరుకిరుకు మనుషుల పట్టణ జీవితాలకీ..
పెట్రోలు వాసనతో పాలిపోయిన హృదయాలకీ..
కాస్తంత చెమ్మగాలి అంటుకడుతుందిది.
తల విరబోసుకున్న తల్లిలా
తల్లి లాంటి ఈ పల్లె ముఖ చిత్రంలా -
ఈ మర్రిచెట్టు

శ్రీనివాస గౌడ్.పి

"వద్దురా... నీకు గుర్తుందో లేదో... నీ చిన్నప్పుడోసారి పండక్కని ముందుగా బయల్దేరి మనం మీ తాతగారి ఊరెళ్ళాం. అక్కడ్నుంచి మా ఊరు బయల్దేరుతోంటే మీ తాతగారు నిన్న క్కడ ఉంచమన్నారు. పండగెళ్ళాక మా ఇంటికి తీసుకొస్తానన్నారు. నీ చేతికో అగ్గి పెట్టె ఇస్తే పుల్లల్ని వెలిగించు కుంటూ నువ్వుండిపోయేవు. మేం వెళ్ళాక కూడా మరో నాలుగు అగ్గి పెట్టెలు వెలిగిస్తూ ఆడుకున్నవాడివి అకస్మాత్తుగా ఏడుపు మొదలు పెట్టే వట. నిన్ను సముదాయించడం ఎవ్వరి తరమూ కాలేదట. ఏడుపు ఆపలేదట. అన్నం తినలేదట...

...ఉండిపోయిన వాడివి మళ్ళీ ఎందుకు అంత ఏడ్చేవు. అగ్గిపు ల్లల సరదా తీరిపోయిన వెంటనే మేం గుర్తొచ్చేం. అక్కడెంత మంది ఉన్నా నీక్కావాల్సిన వాళ్ళం మేమే కాబట్టి మేం కనిపించకపోయే సరికి ఏడ్చేవు. ఆ సమయంలో బస్సు లేక ఉదయం బస్సుకి నిన్ను తీసుకొచ్చేరు. ఆ రాత్రంతా ఏడ్చేవేమో, బెంబేలు పడిపోయేవేమో, తిండి, నిద్ర కూడా లేదేమో... పది రోజులు జ్వరం పడిన వాడిలా అయిపోయేవు. నన్ను చూసి పరుగెత్తకొచ్చి బల్లిలా కరుచుకుపో యేవు. ఎంత సేపటికో కానీ మామూలు కాలేకపోయేవు...

...ముందుగా ఆశ పడింది, వాడి ఏడుపు చూసి బాధ పడిందీ నిజమే. కానీ రాత్రి నాకు నీ చిన్నప్పటి ఆ సంఘ టన గుర్తొచ్చి ఆ బాధని తీసేసింది. ఇప్పుడు నేనేమీ బాధపడ్డం లేదు.

...మన ఆశలు పిల్లలకి శాపాలు కాకూడదు. అప్పుడు నువ్వు నా ఒడి లోనే అన్నీ మరచిపోయి పడుకొనే వాడివి. వాడూ వాళ్ళమ్మ ఒడిలోనే అలా ఉండగలడు. నా దగ్గరా అలా ఉండాలనుకోవడం అవివేకం అవు తుంది. చిన్నపిల్లలకు ముందుగా తల్లిదండ్రులే తనవాళ్ళు. ఎవరైనా వాళ్ళ తర్వాతే. బామ్మలూ, తాత య్యలూ కూడా తర్వాత వాళ్ళే. మీరు కళ్ళ ముందుంటేనే వాళ్ళు మా ఒడిలో ఆడుకుంటారు. మా ఒడి వాళ్ళకు అనుభూతుల్నిస్తుంది. మీ ఉనికే వాళ్ళ మనసుకి ఆ అనుభూతుల్ని ఆస్వాదిం చాలన్న అభిరుచిని కలుగజేస్తుంది...

అమ్మ ఆగింది.

"పోనీ మీరు మాతో వచ్చేయగూ డదా అమ్మా."

"మళ్ళీ మొదటికే వచ్చేవా. నిర్ణ యాలు నిముష నిముషానికీ మార్చు కొనే వాళ్ళు ముందడుగు వేయలేరు. మీరు వెళ్ళండి. మీరు ఉండలేకపో యినా, మేం ఉండలేకపోయినా నువ్వు చెప్పినట్టే చేద్దాం." అని అమ్మ లేచింది.

అమ్మ వెనుకే నేను క్రిందికి దిగేను. ●